సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం | 11 | జూలై | 2025



భార్య దారుణ హత్య

ఆస్తిని పెద్ద కొడుక్కి రాసివ్వమని అడిగిన భార్యను భర్త అంతమొందించిన ఘటన కలిదిండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారంలో చోటుచేసుకుంది. 8లో ▸



హత్యకేసులో నిందితుడి అరెస్ట్

భార్య వివాహేతర సంబంధానికి సహకరిస్తోందనే కోపంతో ఎదురింటి మహిళను కత్తితో నరికి చంపిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. 8లో ▸



జీవితాలతో చెలగాటం

అగ్నిమాపక అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ప్రమాదాలను అదుపు చేసే వాహనాలు, సిబ్బంది లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. 8లో ▸

న్యూస్‌రీల్

విద్యపై శ్రద్ధ చూపాలి



మెగా పీటీఎంలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం: విద్యార్థులు చిన్నతనం నుంచి విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. గురువారం పట్టణంలో గునుపూడి ఉమాసోమేశ్వర మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలలకు వెళుతున్న విద్యార్థులను తల్లిదండ్రులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు రద్దుచేయాలి



తణుకులో కల్లుగీత కార్మికుల నిరసన

తణుకు అర్బన్: గ్రామాల్లో బెల్ట్ షాపులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి డిమాండ్ చేశారు. స్థానిక అమరవీరుల భవనంలో గురువారం తణుకు డివిజన్ గీత కార్మికుల సహకార సొసైటీల అధ్యక్షుడు కట్టా వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ గీత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. గ్రామాల్లో తాటి, ఈత చెట్లను దౌర్జన్యంగా నరికి వేస్తున్నారని, ఆపాలని కోరారు. వృత్తిలో భాగంగా దివ్యాంగులైన, మరణించిన వారి కుటుంబాలకు గతంలో పరిహారం ఇచ్చేవారని, ప్రస్తుతం ఆ విధానం రద్దు చేయడం తగదన్నారు. ఈనెల 14న కలెక్టర్‌కు గీత కార్మికుల సమస్యలను చెప్పుకుందాం తరలిరండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కల్లుగీత సహకార సొసైటీల అధ్యక్షుడు కాసాని శ్రీనివాసు, తొంట ముత్యాలు పాల్గొన్నారు.

తిరువన్నామలై రైలుకు వీరవాసరంలో హాల్ట్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): నర్సాపూర్–తిరువన్నామలై ప్రత్యేక రైలుకు వీరవాసరం స్టేషన్‌లో రెండు నిమిషాలు హాల్టింగ్ సదుపాయం కల్పించినట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ నుంచి వెళ్లే రైలు (07219) వీరవాసరం స్టేషన్‌కు మధ్యాహ్నం 1.23 గంటలకు చేరుకుని, 1.25 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. తిరువన్నామలై నుంచి వచ్చే రైలు (07220) రాత్రి 11.28 గంటలకు వీరవాసరం స్టేషన్‌కు చేరుకుని, తిరిగి 11.30 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు.

పాఠశాల విలీనానికి నిరసనగా ఆమరణ దీక్ష



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్

పెనుమంట్ర: పెనుమంట్ర దళితవాడలోని ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాలను దూరంగా ఉన్న మరో పాఠశాలలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తాను ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక గురువారం విలేకరులకు తెలిపారు. 80 ఏళ్ల నాటి పాఠశాలను గత ప్రభుత్వంలో నాడు–నేడు నిధులతో అభివృద్ధి చేశారని, విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియకుండా గత హెచ్‌ఎం, ఎంఈఓ కలిసి విద్యాకమిటీ సభ్యులను పక్కదారి పట్టించి ఇష్టానుసారం పాఠశాలను మరో పాఠశాలలో విలీనం చేశారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తాను దీక్షకు దిగనున్నట్టు చెప్పారు. ఈ మేరకు తహసీల్దార్, పోలీస్ అధికారులకు కూడా వినతి పత్రాలు అందించానన్నారు. అలాగే గురువారం వైఎస్సార్ నగర్‌లో శంకుస్థాపన కార్యక్రమాలు జరగ్గా తాము వెళ్లేలోపు ప్రజాప్రతినిధులు కానివారితో కొబ్బరికాయలు కొట్టించి అధికారులు తమను అవమానపరిచారని ప్రియాంక వాపోయారు. సమావేశంలో పెనుమంట్ర–1 ఎంపీటీసీ చింతపల్లి మంగాదేవి, ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మొక్కుబడి తంతు

పీటీఎం.. పేలవం

- ప్రచార ఆర్భాటంగా పేరెంట్స్ టీచర్స్ మీట్
- జిల్లాలో 1,920 ప్రభుత్వ, ప్రాథమిక పాఠశాలలు, 121 జూనియర్ కళాశాలల్లో నిర్వహణ లక్ష్యం
- మమ అనిపించిన ప్రైవేట్ విద్యాసంస్థలు
- ఎంపీపీ, ప్రాథమిక పాఠశాలల్లో తూతూమంత్రంగా..
- చాలాచోట్ల ఉదయం 11 గంటలు దాటినా మొదలుకాని సమావేశాలు
- నామమాత్రంగానే తల్లిదండ్రుల హాజరు



వేంద్రలో ఉదయం 11 గంటల సమయానికీ తల్లిదండ్రులు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

సాక్షి, భీమవరం: పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ (పీటీఎం) అంటూ కూటమి ప్రభుత్వం చేసిన హడావుడి ప్రచార ఆర్భాటమే అయ్యింది. మాకెందుకీ ఖర్చన్న ధోరణిలో ప్రైవేట్ విద్యాసంస్థలు మమా అనిపించగా, చాలాచోట్ల ఎంపీపీ, ప్రైమరీ పాఠశాలల్లో మొక్కుబడి తంతుగానే సమావేశాలు సాగాయి. తల్లిదండ్రుల హాజరు అంతంతమాత్రమే కావడంతో సమావేశాలు వెలవెలబోయాయి.

1,920 పాఠశాలలు.. 121 జూనియర్ కాలేజీలు

పిల్లలు బంగారు భవిష్యత్తు కోసం.. బడివైపు ఒక అడుగు పేరిట గురువారం పీటీఎం నిర్వహణకు ప్రభుత్వం పిలుపునిచ్చింది. జిల్లాలోని 1,920 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకు చెందిన 2,79,204 మంది, 121 జూనియర్ కళాశాలల్లోని 37,124 విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నది లక్ష్యం. విద్యార్థుల సంఖ్యను బట్టి ఇటీవల సమగ్ర శిక్ష నుంచి పాఠశాలలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు కాంపొజిట్ గ్రాంట్ విడుదల కాగా ఈ మొత్తం నుంచి 20 శాతం నిధులను పీటీఎంల నిర్వహణకు వెచ్చించేందుకు ఎస్ఎస్ పీడీ ఆదేశాలిచ్చారు.

అరకొర కేటాయింపులు : అరకొర కేటాయింపులతో చాలాచోట్ల మొక్కుబడిగానే కార్యక్రమాలు జరిగాయి. పాలకోడేరు మండలం వేంద్ర హైస్కూల్‌లో ఉదయం తొమ్మిది గంటలకు మొదలుకావాల్సిన జిల్లాస్థాయి మెగా పీటీఎం పేరెంట్స్ లేకపోవడం వలన ఉదయం 11 గంటలకు కూడా మొదలవ్వక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. త్వరగా హాజరుకావాలని పేరెంట్స్‌కు ఉపాధ్యాయులు ఫోన్లు చేయాల్సి వచ్చింది. 250 మంది విద్యార్థులకు వంద మందిలోపే పేరెంట్స్ హాజరయ్యారు. ఆకివీడు జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు పేరెంట్స్ సమావేశం మొదలైంది. కూటమి నేతల రాక కోసం రెండున్నర గంటల పాటు విద్యార్థులు, పేరెంట్స్ వేచి చూడాల్సి వచ్చింది. పాఠశాలలో 400 మంది విద్యార్థులకు వంద మంది పేరెంట్స్ కూడా హాజరుకాలేదు. చాలా హైస్కూళ్లు, ఎంపీపీ, ప్రైమరీ స్కూళ్లలో ఇదే పరిస్థితి. ప్రైవేట్ విద్యాసంస్థలు సొంత నిధులు వెచ్చించాల్సి రావడంతో కొన్ని తరగతులకు చెందిన విద్యార్థులు, వారి పేరెంట్స్‌కు మాత్రమే పీటీఎంలు నిర్వహించగా, మరికొన్ని చోట్ల సమావేశాలు జరిగిన దాఖలాలే లేవు.

సమస్యలు నిల్.. ప్రచారం ఫుల్

విద్యార్థుల బంగారు భవిష్యత్తును దిశానిర్దేశం చేస్తూ పేరెంట్స్, టీచర్స్ మీట్ జరగాల్సిపోయి కూటమి నేతల ప్రచార ఆర్భాటానికే అన్నట్టు సమావేశాలు సాగాయి. పాఠశాలల్లోని సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను పక్కనపెట్టి అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత ఈ విద్యా సంవత్సరానికి విడుదల చేసిన తల్లికి వందనం గురించి ప్రసంగాలకే నేతలు పరిమితమయ్యారు. కాగితాలపై ఉపన్యాసాలు రాయించి విద్యార్థులతో చదివించారు. ఇరగవరం మండలం రేలంగిలో జరిగిన పీటీఎంలో తమకు ఆహ్వానం అందలేదంటే, తమకు సమాచారం లేదంటూ కూటమి నేతలు ఒకరి వద్ద ఒకరు అసంతృప్తిని వెళ్లగక్కుకోవడం కనిపించింది. పలుచోట్ల సహపంక్తి భోజనాలు తూతూమంత్రంగానే జరిగాయి. పెనుగొండ మండలంలోని పలు పాఠశాలల్లో పప్పు, సాంబరు వడ్డించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో స్నాక్స్‌తో సరిపెట్టారు. వేంద్రలో భోజనం పాత్రలను విద్యార్థులతో మోయించడం కనిపించింది.

ఇవీ మార్గదర్శకాలు

విద్యాశాఖ మార్గదర్శకాల మేరకు పండుగ వాతావరణంలో పీటీఎంలు నిర్వహించాలి. పేరెంట్స్‌కు మహిళలు, పురుషుల విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించడం, గ్రీన్ పాస్‌పోర్ట్ కింద తల్లి పేరిట ప్రతి విద్యార్థి పెంచే విధంగా ఒక మొక్కను అందజేయడం, వన్–ఆన్–వన్ ఇంటరాక్షన్‌గా విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్ట్, హెల్త్ నివేదికను పేరెంట్స్‌కు వివరించాలి. తల్లులకు విద్యార్థులతో పాదపూజ చేయించాలి. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేయాలి.



వేంద్రలో జరిగిన జిల్లాస్థాయి పీటీఎంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జిల్లాస్థాయి కార్యక్రమం.. అపహాస్యం



వేంద్ర హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పాత్రలను మోసుకెళ్తున్న విద్యార్థులు

పాలకోడేరు: మండలంలోని భూపతిరాజు సుబ్బతాతరాజు జెడ్పీ హైస్కూల్‌లో జిల్లాస్థాయిలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీట్ అపహాస్యం పాలైంది. కార్యక్రమం ఆసాంతం లోటుపాట్లు కనిపించాయి. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ప్రకటించినా 11.30 వరకూ మొదలుకాలేదు. కలెక్టర్ హాజరైన తర్వాత కూడా ఉపాధ్యాయులు పేరెంట్స్‌కు కబురు పంపారు. అయినా తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. నిన్నటివరకూ వేంద్రలో నిర్వహిస్తారని తమకు తెలియదని, మోగల్లు అని అన్నారని ఉపాధ్యాయులు అన్నారు. జిల్లాస్థాయి కార్యక్రమాన్ని డిప్యూటీ ఎంఈఓ, ఎంఈఓ పర్యవేక్షించాలి కదా అని కొందరు వ్యాఖ్యానించారు. భోజనాన్ని ప్రత్యేకంగా తయారుచేయించకుండా, రోజూ పాఠశాలకు వచ్చే ఆహారాన్ని ఎక్కువ స్థాయిలో తీసుకురావడం కనిపించింది. ఆహార పదార్థాల పాత్రలను విద్యార్థులే హైస్కూల్‌లోకి తీసుకురావడం కనిపించింది. తల్లిదండ్రులు, విద్యార్థులు భోజనం తినేందుకు సరైన స్థలం లేక నిలబడే తిన్నారు.

నిర్దేశిత లక్ష్యంతో.. ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 1,960 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 6 వేల మంది ఉపాధ్యాయులు భాగస్వాములవుతున్నారన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలు అనుగుణంగా విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులు కావాలన్నారు. డీఈఓ ఈ.నారాయణ, హెచ్‌ఎం జీవీవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన



కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్న ఉమ్మడి పశ్చిమ ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): కక్షిదారులు మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి సూచించారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో కక్షిదారులకు మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం అనే అంశంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంపై అవగాహన కల్పించేలా వారం పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి 'వన్–కే' వాక్ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, పోలీస్ సిబ్బంది, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు, సిబ్బంది పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ఎండగడదాం

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి కృష్ణంరాజు

తాడేపల్లిగూడెం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ప్రజలను మోసం చేయడంలో దిట్ట అని చంద్రబాబు మరోమారు నిరూపించుకున్నారని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ అంశంపై స్థానిక వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొట్టు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, 18 ఏళ్లు దాటిన యువతులకు ప్రతి నెలా రూ.1,500, ప్రతి కుటుంబానికీ జాబ్‌కార్డు, ఉద్యోగం వచ్చేవరకూ నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, ఏడాదికి ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు పంపిణీ అని చెప్పిన చంద్రబాబు ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. ప్రైమరీ పాఠశాలలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

ధనార్జనే ధ్యేయంగా ఎమ్మెల్యే : తాను మంత్రిగా ఉన్న సమయంలో తాడేపల్లిగూడెంలో ప్రారంభించిన పనులకు ఇప్పుడు స్థానిక ప్రజాప్రతినిధి కొబ్బరికాయలు కొట్టి అంతా ఆయనే చేస్తున్నట్టు వ్యవహరించడం సరికాదని కొట్టు అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో నియోజకవర్గానికి అభివృద్ధి పనులు ఏమి తీసుకువచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. రహదారులపై గోతులు పూడ్చామని చెప్పినా.. ఆ గుంతలు పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో చూడాలన్నారు. రోడ్లపై ప్రయాణం ప్రమాదభరితంగా మారిందన్నారు. ధనార్జనే ప్రధానం అన్నట్టు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఉన్నారని ఆరోపించారు. తన సహకారంతోనే ఆయన కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్ అయ్యారన్న విషయాన్ని మర్చిపోయి ఇప్పుడు మాట్లాడుతున్నారని కొట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తన ముద్ర ఉందన్నారు. తన గురించి మాట్లాడే విధానంలో సంస్కారంగా వ్యవహరించాలన్నారు. కూటమి అవినీతి పాలనపై వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ, పట్టణాల్లో వార్డుల వారీగా నిర్వహించే ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

శ్రేణులకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ పార్టీలో నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. జిల్లాస్థాయిలో తాము, రాష్ట్రస్థాయిలో వైఎస్ జగన్ అండగా ఉంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులపై 4,500 కేసులు నమోదు చేశారన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్ పర్యటనలకు ప్రభుత్వం ఆంక్షలు విధించడం దారుణమన్నారు. 2029 ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌ని ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, నాయకులు కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, కైగాల శ్రీనివాస్, లంకా రాజశేఖర్, షేక్ హుస్సేన్ బీబీ, నూని అనూరాధ, తాడిపర్తి రజని, సూర్పని రామకృష్ణ, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి

ఆకివీడు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం జనరల్ సెక్రటరీగా ఆకివీడుకు చెందిన పడాల శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కమిటీ ఉత్తర్వులు జారీచేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం జరిగింది. ఆకివీడు నగర పంచాయతీ విప్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.

శుభకరి.. శాకంబరి



సిరులతల్లి.. కల్పవల్లి.. భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారికి ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గురువారం శాకంబరి అలంకరణ చేశారు. పలురకాల పండ్లు, కూరగాయలతో విజయవాడకు చెందిన నిపుణుల సహకారంతో అలంకరించినట్టు ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 70 మంది వేద పండితులతో ఆలయం వద్ద చండీహోమం నిర్వహించారు.

– భీమవరం (ప్రకాశంచౌక్)

బెధరగొడుతున్నాయ్

వెజిట్రబుల్స్

- ఆకాశాన్నంటుతున్న ధరలు
- కిలోకు రూ.15 వరకు పెరుగుదల
- ధరల నియంత్రణపై చర్యలు శూన్యం



ఏలూరు (ఆర్ఆర్‌పేట): కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏటా వేసవిలో కూరగాయల ధరలు పెరుగుతూ.. వర్షాలు పడగానే తగ్గుతుంటాయి. అయితే ఈ ఏడాది మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కాగా ఇప్పుడు అన్నిరకాల కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. మూడు రోజులుగా కూరగాయల ధరలు కిలోకు రూ.5 నుంచి రూ.15 వరకు పెరిగాయి. టమాటా గత నెలలో కిలో రూ.16 నుంచి రూ.18 ఉండగా ప్రస్తుతం రూ.36కు చేరింది. పచ్చిమిర్చి కిలో గత గురువారం రూ.40 ఉండగా ఇప్పుడు రూ.60కు, పందిరి బీర కాయలు రూ.40 నుంచి రూ.50కు, వంకాయలు (కాంతులు) రూ.38 నుంచి రూ.50కు చేరాయి. ఒక్క రోజులో దొండకాయలు కిలో రూ.6, గోరుచిక్కుడు రూ.8 చొప్పున పెరిగాయి. గత సోమవారం కీరా దోస కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.50 పలుకుతోంది. ఇలా అన్నిరకాల కూరగాయల ధరలు పెరిగాయి.

రైతు బజారుల్లోనే 400 క్వింటాళ్లు

ఏలూరులో సుమారు 90 వేల కుటుంబాల్లో 3.10 లక్షల జనాభా ఉన్నారు. నగరంలో రెండు రైతు బజార్లు అందుబాటులో ఉన్నాయి. వీటికి వన్‌టౌన్‌లో ఎస్ఎస్ కూరగాయల మార్కెట్, పలు ప్రాంతాల్లో చిన్నపాటి కూరగాయల దుకాణాలు ఉన్నాయి. వీటితో పాటు ఇంటింటా తిరుగుతూ కూరగాయలు అమ్మే వ్యాపారులు 30 మంది వరకు ఉన్నాయి. నగరంలోని వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాల్లోని రైతు బజార్ల ద్వారా రోజుకు సుమారు 400 క్వింటాళ్ల కూరగాయలు, దుంపలు, ఉల్లిపాయలు, ఆకుకూరలు విక్రయాలు జరుగుతున్నాయి. ఇతర దుకాణాలు, ఇంటింటా తిరిగి విక్రయించే వారి ద్వారా మరో 800 క్వింటాళ్ల విక్రయాలు జరుగుతున్నట్టు అంచనా. ఈ లెక్కన నగరవాసులపై పెరిగిన కూరగాయల ధరల భారం రోజుకు సుమారు రూ.6 లక్షల వరకు ఉంటోంది.

పట్టించుకోని అధికారులు

కూరగాయల ధరలు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్ కంటే రైతు బజార్లతో కొద్దిమేర ధరలు తక్కువగా ఉన్నా.. ధరల పెరుగుదల అసాధారణంగా ఉందని అంటున్నారు. గతంలో కూరగాయల ధరలు పెరిగితే రైతు బజార్లలో సబ్సిడీపై అందించేవారు. టమాటా, ఉల్లిని ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించేవారు.

కొనలేకపోతున్నాం



మూడు రోజులుగా కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కిలోకు రూ.10 వరకు ఎక్కువగా చెబుతున్నారు. టమాటా గతనెలలో కిలో రూ.16 ఉంటే ఇప్పుడు రూ.36 అమ్ముతున్నారు. దొండ, బెండకాయల ధరలు పెరిగాయి. ముఖ్యంగా పచ్చి మిరప నెల క్రితం కిలో రూ.18 నుంచి రూ.24 మధ్య ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.60కు పైగా అమ్ముతున్నారు.

– గొల్లవిల్లి ఆదిలక్ష్మి, గృహిణి, ఏలూరు

చర్యలు తీసుకోవాలి



మా ఇంటి అవసరాలకు వారానికి సరిపడా కూరగాయలు ఒకేసారి తీసుకుంటాం. ఇప్పుడు పెరిగిన ధరల కారణంగా మరో రూ.200 అధికంగా ఖర్చవుతోంది. ఇది సామాన్యులకు భారం. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కూరగాయల ధరలను తగ్గించే ఏర్పాట్లు చేయాలి. లేదా పేదల కోసం ప్రత్యేక కౌంటర్లలో కూరగాయలు విక్రయించే ఏర్పాట్లు అయినా చేయాలి.

– ముమ్మిన గిరిజ, గృహిణి, ఏలూరు

క్లుప్తంగా

పారిజాతగిరి హుండీ లెక్కింపు



పారిజాతగిరిలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని గోకుల తిరుమల పారిజాతగిరిలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. దేవదాయశాఖ ఏలూరు జిల్లా ఇన్‌స్పెక్టర్ వి.సురేష్‌కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. మొత్తం 105 రోజులకు గాను రూ.11,35,112 ఆదాయం వచ్చినట్లు ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. హుండీ లెక్కింపులో విజయవాడ, ఏలూరు, రిటైర్డ్ ఉద్యోగులు, కామయ్యపాలెం, పుట్లగట్లగూడెం సేవాసంఘం, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఇండియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి తోమాల సేవ, తీర్థప్రసాద గోష్టి, తదితర పూజలు నిర్వహించారు. స్వామి వారిని నరసాపురం, పాలకొల్లు, తణుకు భక్తులు దర్శించుకున్నారు.

20న భీమవరంలో చెస్ టోర్నమెంట్

భీమవరం: ఇంటర్నేషనల్ చెస్ డేను పురస్కరించుకుని అనసూయ చెస్ అకాడమీ, వెస్ట్ గోదావరి చెస్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన గ్రంధి వెంకటేశ్వరరావు మెమోరియల్ ఇన్విటేషనల్ ఏపీ స్టేట్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మాదాసు కిషోర్ చెప్పారు. గురువారం టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని తాలూకా ఆఫీసు సెంటర్‌లోని జీవీఆర్ కళ్యాణ మండపంలో టోర్నమెంట్ జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచితంగా మాస్టర్ చెస్ బోర్డులు, విజేతలకు రూ.20 వేల నగదు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు తోట భోగయ్య విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

భీమవరం: ఓ వ్యక్తి నుంచి సెల్‌ఫోన్ దొంగిలించిన ఇరువుర్ని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు చెప్పారు. గురువారం ఉదయం వీరమ్మపార్క్ వద్ద సుంకర ఏసుదాసు వాకింగ్ చేస్తుండగా తణుకు పట్టణం అజ్జరం కాలనీకి చెందిన పులిగోరి నాని, అనకాపల్లికి చెందిన షేక్ అలీషా కత్తితో బెదిరించి ఏసుదాసు వద్ద సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఏసుదాసు తన స్నేహితుల సహాయంతో నిందితులను పట్టుకుని పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

వ్యభిచారం కేసులో నిందితుడి అరెస్ట్

భీమవరం: వ్యభిచారం కేసులో పాతనేరస్తుడ్ని అరెస్ట్ చేసినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు గురువారం చెప్పారు. 2020 మే 13వ తేదీన పట్టణంలోని లాడ్జిలో మహిళలతో వ్యభిచారం చేయిస్తున్న కేసులో రాజమహేంద్రవరం నగరానికి చెందిన కె సాయిరామ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ నాగరాజు తెలిపారు. ఈ కేసులో గతంలోనే ఇద్దర్ని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

జీవితాలతో చెలగాటం

- మూడు నెలల్లో 3 భారీ అగ్నిప్రమాదాలు
- రెండు ఫైరింజన్లతో నెట్టుకొస్తున్న అగ్నిమాపక శాఖ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ప్రజలు భద్రత ప్రశ్నార్థకంగా మారిన వైనం



వంగాయగూడెంలో సుష్మిత ఫర్నిచర్, కుషనింగ్ ఇండస్ట్రీలో అగ్నిప్రమాదం





ఏలూరు అగ్నిమాపక శాఖ కార్యాలయంలోని ఫైరింజన్, ఏలూరు జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయం

ఏలూరు టౌన్: అగ్నిమాపక అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కడైనా భారీ అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటిని అదుపు చేసేందుకు అవసరమైన అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలు, కార్మికుల ప్రాణాల భద్రత గాల్లో దీపమేనా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఏలూరు నగరంలోనే గత మూడు నెలల్లో మూడు భారీ అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవటం ఆందోళన కలిగిస్తోంది. పైగా ఒకే తరహా వస్తువుల తయారీ ఇండస్ట్రీల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. యాజమాన్యాల నిర్లక్ష్యం.. అగ్నిమాపక అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏలూరులో వరుసగా అగ్నిప్రమాదాలు

జిల్లాలో 2024 జనవరి నుంచి 2025 జూన్ వరకూ సుమారుగా 598 అగ్నిప్రమాదాలు సంభవించగా ఏలూరు శివారు ప్రాంతాల్లో వరుసగా మూడు నెలల్లో మూడు అగ్నిప్రమాదాలు జరిగాయి. ఈ మూడు అగ్నిప్రమాదాలు పరుపులు, ఫర్నిచర్ తయారీ పరిశ్రమల్లో కావటం గమనార్హం. అదృష్టవశాత్తు అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో కార్మికులు లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. ఏలూరు శివారులోని గణేష్ సోఫా అండ్ ఫర్నిచర్స్ పరిశ్రమలో జూన్ 5న భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సాయంత్రం వేళలో ప్రమాదం జరగడం, కార్మికులు ముందుగానే గుర్తించి బయటకు పారిపోవటంతో ప్రాణనష్టం తప్పింది. ఇదే తరహాలో ఏలూరు సోమవరప్పాడులోని సోఫా, పరుపుల తయారీ కంపెనీలోనూ అగ్ని ప్రమాదం జరిగింది. తాజాగా గురువారం వంగాయగూడెం కేన్సర్ హాస్పిటల్ సమీపంలో సుష్మిత ఫర్నిచర్, కుషనింగ్ తయారీ ఇండస్ట్రీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కోట్లాది రూపాయాల ఆస్తి నష్టం జరిగింది.

ప్రమాదాల నివారణ సాధ్యమేనా?

ఏలూరు జిల్లా కేంద్రంలో అగ్నిమాపక శాఖకు కేవలం రెండే ఫైరింజన్లు ఉన్నాయి. ఒక ఫైరింజన్ మరమ్మతుల్లో ఉంది. అత్యవసర పరిస్థితుల్లో ఈ ఫైరింజన్ సామర్థ్యంపై ఆధారపడితే తీవ్ర పరిణామాలు తప్పవని అంటున్నారు. అగ్నిమాపక సిబ్బంది సైతం పూర్తిస్థాయిలో లేరంటున్నారు. దీనితోడు పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా చర్యలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువురు విమర్శిస్తున్నారు. తాజాగా వంగాయగూడెం సుస్మిత ఫర్నిచర్ అండ్ కుషనింగ్ ఇండస్ట్రీలో అగ్ని ప్రమాదం సంభవించడంతో.. అసలు పరిశ్రమకు ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్, అత్యవసర ద్వారం లేదని, ఫైర్ సేఫ్టీ చర్యలపై అధికారుల పర్యవేక్షణపైనా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఏలూరు నగరంలోనూ, శివారు ప్రాంతాల్లోనూ పరిశ్రమలు, ఇండస్ట్రీలు, ఆయా వస్తువుల ఉత్పత్తి సంస్థల్లో ఫైర్‌సేఫ్టీపై నిఘా, పర్యవేక్షణ, తనిఖీలు లేవంటున్నారు.

పరుపుల పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరం శివారు వంగాయగూడెంలోని పరుపుల పరిశ్రమలో గురువారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. వంగాయగూడెం కేన్సర్ హాస్పిటల్ సమీపంలోని సుస్మిత ఫర్నిచర్ కుషనింగ్ పరిశ్రమలో ఉదయం 9.30 గంటల సమయంలో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఎవరూ రాకముందే ఈ ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం తప్పింది. ఇక్కడ అత్యంత ప్రమాదకరమైన రసాయనాలతో ఫోమ్‌ను తయారు చేస్తారు. ఈ రసాయనాల మిక్సింగ్‌కు వినియోగించే ట్యాంకర్‌ను మైనస్ డిగ్రీల్లో చల్లబరుస్తారు. కెమికల్ మిక్సింగ్ ట్యాంకర్‌కు సంబంధించిన ఏసీలను ఆన్ చేసిన వాచ్‌మెన్లు ఇద్దరూ కాలకృత్యాలు తీర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాప్తి చెందటంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్, పోలీస్ సిబ్బంది సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు.



అగ్నిప్రమాదంతో పరిశ్రమ నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ, మంటలు

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

కైకలూరు: భార్య వివాహేతర సంబంధానికి సహకరిస్తోందనే కోపంతో ఎదురింటి మహిళను కత్తితో నరికి చంపిన వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. కైకలూరు సీఐ కార్యాలయంలో కేసు వివరాలను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ వెల్లడించారు. కలిదిండి మండలం పోతుమర్రు శివారు గొల్లగూడెంలో మంగళవారం మధ్యాహ్నం భోజనానికి కూర్చున్న నంగెడ్ల వరలక్ష్మీదేవీ(39)ని ఎదురింటిలో నివాసం ఉంటున్న కట్టా రామాంజనేయులు(33) బయటకు పిలిచి కత్తితో నరికి పరారయ్యాడు. రామాంజనేయులు భార్య కృష్ణవేణి ఇదే గ్రామానికి చెందిన కట్టా నాగమల్లేశ్వరరావుతో చనువుగా ఉంటోంది. ఈ విషయాన్ని పలువురు గ్రామస్తులు భర్త రామాంజనేయులుకు చెప్పారు. మృతురాలు వరలక్ష్మీదేవీ నాగమల్లేశ్వరరావు వద్ద పనిచేస్తుండడంతో రామాంజనేయులు భార్య వివాహేతర సంబంధానికి వరలక్ష్మీదేవి సహకరిస్తోందని గట్టిగా నమ్మాడు. దీంతో ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న ఆమెను నరికి చంపి పరారయ్యాడు. కైకలూరు మండలం ఉప్పుటేరు వద్ద నిందితుడు రామాంజనేయులును పోలీసులు అరెస్టు చేశారు. సమావేశంలో కలిదిండి, కైకలూరు రూరల్, ముదినేపల్లి ఎస్సైలు వేంకటేశ్వరరావు, రాంబాబు, వీరభద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద ఏఐఎస్‌ఎఫ్ నాయకుల ధర్నా

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్, జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం విద్యార్థులతో కలిసి ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. దీనివల్ల డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు సైతం హాల్ టికెట్లు ఇవ్వకుండా ఒత్తిడి చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ ఏలూరు జిల్లా కోశాధికారి, ఎం.క్రాంతికుమార్, సునీల్, ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్య దారుణ హత్య

- ఆస్తిని పెద్ద కుమారుడికి రాసివ్వమని అడగడమే కారణం
- అనంతరం ఆత్మహత్యకు యత్నించిన భర్త



రక్తపు మడుగులో జయలక్ష్మి మృతదేహం



ఆత్మహత్యకు యత్నించిన పెద్దిరాజు

కైకలూరు: ఆస్తిని పెద్ద కొడుక్కి రాసివ్వమని అడిగిన భార్యను అంతమొందించాడో భర్త. ఈ ఘటన ఏలూరు జిల్లా కలిదిండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారంలో చోటుచేసుకుంది. వివరాలివి.. గ్రామానికి చెందిన కట్టా పెద్దిరాజు (50), జయలక్ష్మి (47) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు మగ సంతానం. పెద్ద కుమారుడికి ఇటీవల పెళ్లయింది. ఇద్దరు కుమారులు వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. పెద్దిరాజుకు గ్రామంలో 40 సెంట్ల భూమి ఉంది. దీనిని అమ్మకానికి సిద్ధం చేస్తున్నాడు. పెద్ద కుమారుడికి వివాహం జరగడంతో దంపతులు ఇల్లు కట్టుకుంటారని, స్థలం అతడికి రాయాలని జయలక్ష్మి భర్తను కోరింది. ఈ విషయంలో తరచూ భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. తన కంటే బిడ్డలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని పెద్దిరాజు భార్యపై ద్వేషం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి నిద్రపోతున్న జయలక్ష్మిపై కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. దీంతో ఆమె ఘటనాస్థలిలోనే ప్రాణం విడిచింది. అనంతరం పెద్దిరాజు భయపడి పురుగు మందు తాగి, చాకుతో పీక కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఇరుగు పొరుగువారు పోలీసులకు సమాచారం అందించారు. ప్రాణాలతో ఉన్న పెద్దిరాజును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమాలకు అడ్డా.. ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కలకలం రేపిన బాధితుని ఆందోళన



ఉండి రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రంగబాబు నిరసన

ఉండి: భూ అక్రమార్కులకు పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డాగా మారిందంటూ రంగబాబు అనే వ్యక్తి గురువారం కార్యాలయం ముందు టెంట్ వేసి ఆందోళనకు దిగడం స్థానికంగా కలకలం రేపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చినగొల్లపాలెంలో తమ ఆస్తికి సంబంధించి అక్రమాలు జరుగుతున్నాయన్నారు. భూ అక్రమాలకు సంబంధించి తనతోపాటు మరికొందరు గత కొద్దికాలం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రావడంతో సబ్ రిజిస్ట్రార్ సెలవుపై వెళ్లిపోయినట్టు పేర్కొన్నారు. కృష్ణాజిల్లాతో పాటు రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల నుంచి రిజిస్ట్రేషన్‌ల కొరకు ఉండికి తరలివస్తున్నట్టు తెలిపారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు లంచాలు తీసుకుంటున్న అధికారులు భూ ఆక్రమణ దారులకు కొమ్ముకాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు తగిన న్యాయం చేయకపోతే భార్యాబిడ్డలతో ఉండి రిజిస్ట్రార్ ఆఫీసు ముందు ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించారు. తమకు సంబంధించిన 32 ఎకరాల భూమిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు ఓ మంత్రి సమీప ఉద్యోగి, రిజిస్ట్రేషన్ శాఖలో ఓ ఉన్నతాధికారి ప్రయత్నిస్తున్నట్లు తనకు అనుమానంగా ఉందని చెప్పారు. దీనిపై అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, అక్రమ రిజిస్ట్రేషన్ల ఆరోపణలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌చార్జి టి.శరాబందురాజు ఖండించారు. ఇలా చేయడం ఎవరివల్లా కాదన్నారు. ఆరోపణలు చేస్తున్న రంగబాబు ఆస్తి కోర్టు పరిధిలో, అదీ నిషేధిత భూముల జాబితాలోనూ ఉందని పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్ళారు గానీ, ఎవ్వరికీ భయపడికాదని స్పష్టం చేశారు.

సొంతూరుకు వచ్చి ఆత్మహత్య

ఏలూరు టౌన్: హైదరాబాద్‌లో భార్యతో కలిసి జీవిస్తున్న ఒక వ్యక్తి సొంతూరు ఏలూరుకు వచ్చిన రెండు, మూడు గంటలకే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... ఏలూరు వన్‌టౌన్ తూర్పువీధి పెదమాలపల్లికి చెందిన తేరా రఘు (26)కు హైదరాబాద్‌కు చెందిన ఒక మహిళతో వివాహమైంది. ఇద్దరూ హైదరాబాద్‌లో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రఘు బుధవారం రాత్రి తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను ఏలూరు వచ్చేస్తున్నాను, ఇక్కడే ఏదో ఒక పని చేసుకుంటూ బతుకుతానని చెప్పాడు. గురువారం తెల్లవారుజామున ఏలూరులోని తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. అనంతరం కొద్దిసేపటికే ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ కింద పడి వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: లారీ వెనుక చక్రాల కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చినతాడేపల్లిలో గురువారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పట్టింపాలెం గ్రామానికి చెందిన నీలం రవితేజ (35) తాడేపల్లిగూడెంలోని ఒక ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నాడు. గురువారం మోటారు సైకిల్‌పై తాడేపల్లిగూడెం వస్తుండగా చిన తాడేపల్లి వచ్చేసరికి ముందు వెళ్తున్న ఎరువుల లోడు లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు వెనుక చక్రాల కింద పడి రవితేజ దుర్మరణం చెందాడు. ప్రమాద స్థలాన్ని రూరల్ ఎస్సై జేవీఎన్.ప్రసాద్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా జాతీయ చేపల రైతుల దినోత్సవం

కై కలూరు: ఆక్వా రంగానికి ఆధునికత జోడించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా మత్స్యశాఖ జేడీ డీ నరసయ్య చెప్పారు. జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా కై కలూరు మత్స్యశాఖ కార్యాలయంలో గురువారం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ హరిలాల్ చౌదరి కృత్రిమ బ్రీడింగ్ చేపల్లో జరిపి విజయం సాధించారన్నారు. దీనికి గుర్తుగా ప్రతి ఏటా జాతీయ చేపల రైతుల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆక్వా ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆక్వా రైతులకు సాగు పద్ధతుల్లో మార్పులు, పథకాల గురించి క్షేత్రస్థాయి సిబ్బంది వివరించాలన్నారు. ముందుగా హీరాలాల్ చిత్రపటానికి అధికారులు, రైతులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కైకలూరు ఏడీ బి.రాజ్‌కుమార్, మత్స్య అభివృద్ధి అధికారి సీహెచ్.గణపతి, ఆక్వా రైతు ఎండీ. ఆసీఫ్‌పాషా, జాన్‌పేట, దానిగూడెం మత్స్య సొసైటీల ఆక్వా రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ కేబుల్ వైర్ల చోరీ

ఆగిరిపల్లి: మండలంలోని అనంతసాగరంలో బుధవారం రాత్రి 5 వ్యవసాయ మోటార్ల వద్ద ఉన్న కేబుల్ వైర్లను దొంగలు అపహరించారు. గురువారం ఉదయం పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు ఈ విషయాన్ని గమనించి ఘొల్లుమన్నారు. మొత్తం ఐదుగురు రైతులకు చెందిన చెందిన మోటర్ కేబుల్ వైర్లు చోరీ అయ్యాయని బాధిత రైతులు సతీష్, వేమూరి ఏసుబాబు తదితరులు చెప్పారు. అనంతసాగరంలో పాత దొంగతనాల్లో ముద్దాయిలుగా ఉన్న వారిపై అనుమానం ఉందని రైతులు చెబుతున్నారు.

కంటైనర్ బోల్తా.. 14 ఆవుల మృతి



జాతీయ రహదారి వ్యాసగాని బ్రిడ్జి వద్ద మృతి చెందిన గోవులు

దెందులూరు: జాతీయరహదారిపై ఆవులను తరలిస్తున్న కంటైనర్ వాహనం బోల్తా పడి 14 ఆవులు మృతిచెందగా 6 తీవ్రంగా, 15 ఆవులు స్వల్పంగా గాయపడ్డాయి. ఈ ఘటన ఏలూరు జిల్లా దెందులూరు మండలం సోమవరప్పాడు వద్ద చోటుచేసుకుంది. విశాఖ నుంచి ఇతర ప్రాంతాలకు ఆవులను తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ, సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. వెంటనే మండల పశువైద్యాధికారి డాక్టర్ హరికి సమాచారం అందించగా ఆయన వైద్య సిబ్బందితో వచ్చి గాయపడిన ఆవులను సమీపంలోని గేదెల ఫారం వద్దకు తరలించి వైద్య సేవలందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం: చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన బల్లే వెంకట నరసింహారావు చర్మంపై తెల్లటి మచ్చలు వచ్చి మంట, దురదతో గత రెండేళ్లుగా బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వాంతులు చేసుకోవడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు నరసింహారావుని కొయ్యలగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి బల్లే గురవయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

2 కిలోల గంజాయి స్వాధీనం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గురువారం జరిపిన దాడుల్లో జెడ్పీ హైస్కూల్ ఎదురుగా గంజాయి కలిగి ఉన్న షేక్ బాషా అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. జంగారెడ్డిగూడెం సర్కిల్‌ను గంజాయి రహితంగా చేసే కార్యక్రమంలో భాగంగా గట్టి నిఘా పెట్టి ఈ దాడులు చేసినట్లు చెప్పారు.

పీఎం సూర్యఘర్‌లో జిల్లా ఫస్ట్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనలో ఏలూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఏపీ ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పీ సాల్మన్‌రాజు ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రూ.12.14 కోట్ల సబ్సిడీతో 2,353 మంది గృహ విద్యుత్ వినియోగదారులు 7.8 మెగావాట్ల సోలార్ పానెల్స్ ఏర్పాటు చేసుకొని నెలకు సుమారు ఒక మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నారన్నారు. వినియోగించిన యూనిట్లు పోను మిగులు యూనిట్లకు అదనంగా ప్రతి యూనిట్‌కు రూ.2.09 పైసలు చొప్పున తిరిగి చెల్లిస్తున్నామన్నారు. ఏలూరు జిల్లాలో ద్వారకాతిరుమల, దుగ్గిరాల, చిననింద్రకొలను, తడికలపూడి ఎర్రంపేట గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించడానికి 44 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి టెండర్లు ఆహ్వానించామన్నారు.

బ్యాంకును మోసగించిన నేరంపై కేసు

జంగారెడ్డిగూడెం: బ్యాంకును మోసగించిన నేరంపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎస్‌బీఐ బ్యాంకుకు చెందిన ఏటీఎంలలో నగదు జమ చేసేందుకు హిటాచీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ఒప్పందం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 2న పట్టణంలోని 9 ఎస్‌బీఐ ఏటీఎంలలో నగదును నింపేందుకు రూ.86 లక్షలను ఏజెన్సీ సీఆర్‌పీ నాయుడు నాగరాజు టీంకు బ్యాంకు అధికారులు అందజేశారు. అదే రోజు సాయంత్రం రూ.5 లక్షలు టాయ్ కరెన్సీ వచ్చిందని నాగరాజు బ్యాంకు అధికారులకు ఫోన్‌చేసి చెప్పడంతో, వారు బ్యాంకుకు తిరిగి రావాలని చెప్పారు. బ్యాంకుకు వచ్చిన నాగరాజు బృందం పొంతనలేని సమాధానాలు, సదరు మొత్తాన్ని చెల్లించకపోవడంతో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పి.జ్యోతికి గురువారం ఫిర్యాదుచేశారు. బ్యాంకును మోసగించిన నేరంపై సీఆర్‌పీ నాగరాజు, బి.నవీన్, సీహెచ్ విజయకుమార్, ఎన్.శివరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



తణుకులో మాజీ మంత్రి కారుమూరికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న జానకి, పార్టీ కార్యకర్తలు

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ తణుకు మండల మహిళాధ్యక్షురాలిగా నియమితులైన ఉండవల్లి జానకి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పదవి బాధ్యతను పెంచుతుందని పార్టీ బలోపేతం చేసేందుకు కష్టపడతానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉండవల్లి సురేష్, బద్దే ప్రవీణ్, జువ్వల వెంకటరాజు, అరిగెల వెంకట్రావు, రామకృష్ణ, ఉండవల్లి సుందరరావు, ఉన్నమట్ల శేఖర్, సరెళ్ల క్రాంతి పాల్గొన్నారు.

శంకరాచార్యస్వామికి విశేష పూజలు



శంకరాచార్య స్వామికి పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వ్యాసపూర్ణిమ సందర్భంగా గురువారం స్థానిక శంకమఠంలో ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి, శంకరాచార్య స్వామికి గురువారం విశేష పూజలు జరిగాయి. సర్వమంగళమ్మ అమ్మవారికి విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. గరికపాటి బాపయ్యశర్మ, ఓగేటి పండు, కొలచన భాస్కర శర్మ, ఆదూరి కృష్ణ మోహన్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కేల్లో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా



వ్యవసాయాధికారి నారాయణరావు

తాడేపల్లిగూడెం రూరల్: రైతు సేవా కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా ఏర్పాటు చేశామని, రైతులు తమ పేర్లు జాబితాలో ఉన్నది, లేనిది పరిశీలించుకోవాలని మండల వ్యవసాయాధికారి నారాయణరావు సూచించారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాబితాలో పేర్లు లేని వారు ఈ నెల 13వ తేదీ లోపు వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించి అర్జీలు అందజేయాలన్నారు. అలాగే, సార్వా సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.210లు చెల్లించి, పంటల బీమా చేయించుకోవాలన్నారు. ఆగస్టు 15వ తేదీ లోపు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి భరణీకుమార్ అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం గురువారం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు బానిసలుగా మారుతున్నారని, దీనివల్ల భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు ప్రగడ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లిగూడెం: ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సు ఆన్ రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్గానిక్, అనలిటికల్ అండ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అనే అంశంపై ఆదికవి నన్నయ్య ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. వివిధ అంశాలపై అమెరికా , ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అతిథులు ఆఫ్‌లైన్.వర్చువల్‌గా మాట్లాడారు. తాజా పరిశోధన లు గురించి చర్చ సాగింది. నన్నయ్య విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కెవి. స్వామి, క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పూజోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని బ్రహ్మకుమారీస్ జ్ఞాన ప్రకాశ్ భవనంలో గురు పౌర్ణమి, గురు పూజోత్సవాలు జరిగాయి. సేవా కేంద్రం నిర్వాహకురాలు బీకే రమాదేవి, ఖమ్మం సేవా కేంద్రం నిర్వాహకురాలు అరుణలు పాల్గొన్నారు. సేవలు అందించిన వారికి సత్కారాలు జరిగాయి.

ధాన్యం బకాయిల కోసం రైతుల ఎదురుచూపులు

- వడ్డీలు కట్టలేకపోతున్నామంటున్న రైతాంగం
- పెట్టుబడి సాయం ఎలాగూ లేదు
- నియోజకవర్గంలో రూ. 47.17 కోట్లు బకాయిలు
- శాపనార్థాలు పెడుతున్న వైనం



దువ్వలో ధాన్యాన్ని బస్తాలకు ఎక్కిస్తున్న రైతులు (ఫైల్)

తణుకు అర్బన్: తూసిన ధాన్యానికి 24 గంటల్లో డబ్బు జమచేస్తామన్న కూటమి ప్రభుత్వ మాటలు వట్టివేనా అని రైతులు నిలదీస్తున్నారు. రబీకి సంబంధించి రెండు నెలల క్రితమే ధాన్యం తూచినప్పటికీ ఇంతవరకు ధాన్యం తాలూకా డబ్బు తమ బ్యాంకు ఖాతాలకు జమకాలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పండిన పంట చేతికొచ్చి డబ్బుగా మారితేనే కానీ చేసిన అప్పులు తీరని నేటి రోజుల్లో ప్రభుత్వ తీరుకు రైతాంగం దుమ్మెత్తిపోసే పరిస్థితి దాపురించింది. పెట్టుబడి సాయం చేయలేని ప్రభుత్వం తూచిన ధాన్యం డబ్బును కూడా సకాలంలో అందించలేకపోతే రైతు ఏం తిని బతకాలంటూ ప్రశ్నిస్తున్నారు. ధాన్యం బకాయిల కోసం అధికారులను కలుస్తుంటే ఇదిగో అదిగో అంటున్నారే తప్ప డబ్బులు మాత్రం వేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కోసం అప్పులు చేశామని కానీ పంట డబ్బు చేతికి రాకపోవడంతో వడ్డీలు కడుతున్నామని రైతులు వాపోతున్నారు.

తణుకు నియోజకవర్గంలో రూ. 47.17కోట్లు బకాయిలు

తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 39 గ్రామాల్లోని రైతులు 1,31,621.09 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిని రైతు సేవా కేంద్రాల ద్వారా తూయగా ఇప్పటిరకు రూ. 253.36 కోట్లు చెల్లింపులు అయ్యాయి. ఇక మిగిలిన రూ. 47.17 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో బకాయిలకు సంబంధించిన 4648 మంది రైతులు ధాన్యం బకాయిల తాలూకా డబ్బుల కోసం ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి కూటమి ప్రభుత్వం నెలకొల్పిందంటూ కన్నీళ్ల పర్యంతమవుతున్నారు.

గతంలో తూచిన వెంటనే జమ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతాంగం ఆర్‌బీకేల ద్వారా తూచిన ధాన్యానికి పారదర్శకతతో పాటు అధికార యంత్రాంగం బాధ్యతగా వ్యవహరించేదని రైతులు చెబుతున్నారు. తూచిన గంటల వ్యవధిలోనే రైతుల బ్యాంకుల ఖాతాల్లో డబ్బులు జమచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకునే పరిస్థితి ఉండేది. దీంతో రైతులు పండిన ధాన్యం తాలూకా డబ్బులు సకాలంలో చేతికందడంతో ఆనందంగా గడిపేవారు. అంతేకాకుండా రైతు భరోసా పేరుతో రూ. 15వేలు పెట్టుబడి సాయంగా ముందస్తుగానే ఏడాదికోసారి రైతుల ఖాతాల్లో జమచేయడంతో పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి కూడా ఉండేది కాదు. కానీ నేడు ధాన్యం తూచి రెండు నెలలు కావస్తున్నా తిరిగి ఖరీఫ్ సమయం వస్తున్నప్పటికీ ధాన్యం తాలూకా బకాయిలు జమకాకపోవడంతో రైతు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ 24 గంటల్లో తూచిన ధాన్యం డబ్బులు జమచేస్తామంటూ చెప్పిన వ్యాఖ్యలను రైతులు సైతం మండిపడుతున్నారు.

	ధాన్యం బకాయిలు.	రైతులు.
తణుకు	రూ. 5.75 కోట్లు	556
అత్తిలి	రూ. 25.84 కోట్లు	2547
ఇరగవరం	రూ. 15.58 కోట్లు	1645

మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యలత

తణుకు అర్బన్: మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యత కల్పించి అధికసంఖ్యలో కేసులు రాజీచేసేందుకు న్యాయవాదులు కృషి చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టులో గురువారం న్యాయవాదులకు నిర్వహించిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. జాతీయ న్యాయ సేవల సంస్థ ఢిల్లీ వారి ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం మీద కోర్టులు పనిచేయు ప్రతి చోట 90 రోజులు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కేసుల్లో ఉన్న ఇరువర్గాలకు కూడా మంచి పరిష్కారం మధ్యవర్తిత్వమేననే విషయాన్ని వారికి అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణ సత్యలత, జూనియర్ సివిల్ జడ్జి సాయిరాం పొతర్లంక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

చంద్రబాబుది దగాకోరు పాలన



అత్తిలిలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి



అత్తిలిలో సమావేశానికి హాజరైన పార్టీనాయకులు, కార్యకర్తలు

- కూటమి ఏడాది పాలనలో రాష్ట్ర ప్రజలంతా మోసపోయారు
- ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం
- బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ సభలో మాజీ మంత్రి కారుమూరి

అత్తిలి: సీఎం చంద్రబాబు పాలన దగాకోరు పాలన అని, కూటమి హామీలకు రాష్ట్ర ప్రజలంతా మోసపోయారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. గురువారం అత్తిలి షాదీఖానా భవనంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో అత్తిలి మండల స్థాయి సమావేశాన్ని మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించి ఇంటింటికీ హామీల బాండ్లను పంపించి అధికారం చేపట్టాక ఇచ్చిన హామీలను విస్మరించారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో పథకాలు ప్రకటించి వాటిని ప్రజలకు అందించకుండా చేసిన మోసాన్ని మరింత చేరువ చేయాలని అన్నారు. యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు ఇలా అన్నివర్గాలను ఏడాదికిపైగా మోసం చేశారని విమర్శించారు. ఏం ఒరగబెట్టారని తొలి అడుగంటూ ప్రజల్లోకి వెళ్తున్నారంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఇచ్చిన హామీలను ప్రజలకు అమలుచేసే విధంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. సూపర్‌సిక్స్ అన్నావు.. బాబు ష్యూరిటీ అన్నావు, కానీ ఏడాది పాలనలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే విధంగా చంద్రబాబు ప్రజల్ని నమ్మించి అడ్డంగా మోసం చేశాడని విమర్శించారు. ప్రతి నెలా ఏదోక సంక్షేమాన్ని అందించే జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సు గెలుచుకున్నారని, ప్రజల్ని ఎలా మోసం చేయాలో చంద్రబాబుకు బాగా తెలుసన్నారు. ఉచిత బస్సు పథకం తుస్సుమనిపించాడని, జిల్లా పరిధి వరకే ఉచిత బస్సు అంటూ ప్రకటన చేయడం మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, మహిళలకు ప్రతి నెలా రూ. 1500లు ఎక్కడ ఇస్తున్నారో సీఎం చంద్రబాబు, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా అందరికీ సంక్షేమం అందించమని ఆదేశాలిస్తే చంద్రబాబు మాత్రం వైఎస్సార్ సీపీ వాళ్లకు పనులు చేయొద్దని చెప్పడం నీచమని అన్నారు. తణుకు నియోజకవర్గంలో ఏపని చేపట్టాలన్నా ఆర్‌కే టాక్స్ తప్పనిసరి అయిందన్నారు. పైడిపర్రు కేంద్రంగా జూద క్రీడలను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని దుయ్యబట్టారు. అమరావతిలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులు మోసపోయామని గ్రహించి, మళ్లీ భూముల ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని చెప్పారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తారని, పార్టీ చేపట్టే కార్యక్రమాలలో కార్యకర్తలు చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూర్‌కోడ్ స్కానర్‌లను గ్రామాల వారికి పార్టీనాయకులకు కారుమూరి నాగేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ గంటావిజేత, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, జిల్లాపార్టీ నాయకులు ఆకుల పండుస్వామి, రంభ సూరిబాబు, పోలినాటి చంద్రరావు, కాకర్ల విశాలాక్షి, వెలగల అమ్మిరెడ్డి, సబ్బితి రాజేష్, కోరుకొల్లు వెంకట్రావు, పెన్మెత్స రామరాజు, సర్పంచ్‌లు వేగేశ్న ధనసత్యనారాయణరాజు, కసిరెడ్డి బాలాజీ, బుడితి సుజన్‌కుమార్, కట్టా అప్పన్న, జల్లూరి జగదీష్, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వన్ టౌన్‌లో 33/11కేవీ హౌసింగ్‌బోర్డు పరిధిలో ఉన్న ఎఫ్‌సీఐ కాలనీ ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 11వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. వాణి కాన్వెంట్ రోడ్డు, పాబోలు వారి వీధి, గ్యాస్ పంపు రోడ్డు, కోతిబొమ్మ సెంటర్, ఎఫ్‌సీఐ కాలనీ, విజేత రోడ్డు, ఏరియా ఆసుపత్రి రోడ్డు తదితర ఏరియాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు. అదే విధంగా పాతూరు సబ్ స్టేషన్ పరిధిలో పీ అండ్ టీకాలనీ ఫీడర్, జెడ్పీ ఫీడర్‌లకు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మెయిన్ రోడ్డు, మసీద్ రోడ్డు, డీఎస్ చెరువు, వివేకానంద బొమ్మరోడ్డు, పీ అండ్ టీ కాలనీ, ఇందిరా నగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిలుపుదల చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ నిలిపివేసే ప్రాంతాలివే...

తణుకు అర్బన్: తణుకు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని తణుకు, తేతలి, అత్తిలి సబ్‌స్టేషన్‌లలో లైన్ల మరమ్మతుల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ డివిజినల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు మండలంలో జాతీయ రహదారి, ఎన్జీవో కాలనీ, డీఎల్‌కే రోడ్డు, సాయి హాస్పిటల్, కొండాలమ్మ పుంత రోడ్డు, ఉమెన్స్ కళాశాల, టి.వేమవరం, జంగం చెరువు, హౌసింగ్‌బోర్డు, ఐక్యనగర్, సజ్జాపురం ప్రాంతాలు, అత్తిలి మండలంలో అత్తిలి, పాలి, ఆరవల్లి, దంతుపల్లి, స్కిన్నెరపురం, సీహెచ్ చెర్వు, ఉరదాళ్లపాలెం, పాలూరు, మంచిలి, ఈడూరు, కొమ్మర ప్రాంతాలు, ఇరగవరం మండలంలో అయినపర్రు, అర్జునుడుపాలెం, పెద్దిరెడ్డిపాలెం, ఓగిడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

టూ టౌన్‌లో సౌత్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్ పరిధిలో 33/11 కేవీ ఎస్ఎస్ పెంటపాడు సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ మార్కెట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలు తొలగించే నిమిత్తం ఈ నెల 11వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. తాళ్ళముదునూరుపాడు, భాగ్యలక్ష్మిపేట పరిధిలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నందున, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం, వీరంపాలెం సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ కే.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పుల్లాయగూడెం, కృష్ణాపురం, వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యం



మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న దృశ్యం

పెంటపాడు: మరుగుదొడ్ల నిర్వహణలో స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రత్తిపాడు త్రిపుల్‌ఎఫ్ గోయంకా ఫ్యాక్టరీ ఎండీ ఓం ప్రకాష్ గోయంకా పేర్కొన్నారు. ప్రత్తిపాడు త్రిపుల్‌ఎఫ్ సహకారంతో గూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికలకు మరుగుదొడ్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాల ఆవరణలో జరిగిన సమావేశంలో ఓంప్రకాస్ గోయంకా మాట్లాడుతూ త్రిపుల్‌ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షల ఖర్చుతో ఈ మరుగుదొడ్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, కూటమి నాయకులు వలవల బాబ్జి, ఈతకోట తాతాజీ స్కూల్ సిబ్బంది తదితరులతో పాటు, కర్మాగార సీనియర్ జీఎం జి. శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నాగవేణి త్రిపుల్ ఎఫ్ యాజమాన్యం, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్తిలిలో పొలం పిలుస్తోంది



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

అత్తిలి: మండలంలో ఉనికిలి, లక్ష్మీనారాయణపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవసాధికారి టి.కే రాజేష్ గురువారం తెలిపారు. ఆయా గ్రామాల్లో నూరు శాతం నారుమళ్లు పూర్తయినట్లు తెలిపారు. ఊడ్చేటప్పుడు నారు సుతలు తెంచి ఊడ్చాలని తెలిపారు. రైతులు ఖరీఫ్ పంటకు సంబంధించి ఆగస్టు మొదటి వారంలోగా బీమా చెల్లించాలని తెలిపారు. ఎకరాకు రూ.210 చెల్లించాలని తెలిపారు. బ్యాంకులో అప్పు తీసుకున్న వారైతే ప్రీమియం మినహాయించడం జరుగుతుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేని రైతులు గ్రీవెన్స్ సెల్‌లో నమోదు చేయించుకోవాలని ఏఓ రాజేష్ సూచించారు.

పశుగ్రాసం పెంపకంపై నూరు శాతం రాయితీ



బంగారుగూడెం గ్రామంలో మండల పశువైద్యాధికారి విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చిన్న, సన్నకారు రైతులకు 10 నుంచి 50 సెంట్ల వరకు గడ్డిమడులకు నూరు శాతం రాయితీ ప్రభుత్వం అందజేస్తుందని మండల పశువైద్యాధికారి టివి. విజయ్‌కుమార్ తెలిపారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని బంగారుగూడెం గ్రామంలో రైతులకు పశుగ్రాస పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు సమయమంతుల కాశి, జనసేన నాయకుడు మట్టా రామకృష్ణ మాట్లాడుతూ పాడి రైతులకు అందుబాటులో ఉంటూ పాడి పరిశ్రమ అభివృద్ధికి డాక్టర్ విజయ్ కుమార్ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం డాక్టర్ విజయ్‌కుమార్‌తో పాటు బదిలీపై వెళ్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకులు గౌతమికి వీడ్కోలు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుర్ల రాము, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవర్తనపై నిఘా ఉంచాలి



ఎల్.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న విద్యార్థి తల్లి

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థుల ప్రవర్తనపై నిఘా ఉంచాలని, వారు ఎలా చదువుతున్నారు ? వంటి విషయాలను తల్లిదండ్రులు గ్రహించాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. గురువారం మండలంలోని ఎల్.అగ్రహారం, మోదుగ గుంట, ఉప్పరగూడెం, దండగర్ర, ఇటుకులగుంట, మాధవరం, అప్పారావుపేట, జగన్నాథపురం, పెదతాడేపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో పేరెంట్స్ కమిటి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాధవరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాం అనే ధోరణి కాకుండా వారి విద్య పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సీరియల్స్, మొబైల్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కట్టా సత్యవతి, పిల్లా రాంబాబు, ఎమ్పీటీసీ విజయదుర్గ, ఉప సర్పంచ్ వల్లేపల్లి సత్యనారాయణ, పీఆర్ ఏఈ శ్రీనివాస్, స్కూల్ కమిటి చైర్‌పర్సన్‌లు నాగబత్తుల పెద్దింట్లు, కప్పల శేషుకుమార్, పండు, వైస్ చైర్‌పర్సన్ లక్ష్మి, హెచ్‌ఎంలు వి.సత్యమూర్తి, ఎం .శ్రీనివాస్, సీహెచ్. చంద్రశేఖర్, జయరాజు, గుదే సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి మనీష, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : విలువలతో కూడిన విద్య అభ్యసించాలని మాజీ కౌన్సిలర్ గురుజు సూరిబాబు తెలిపారు. స్థానిక సుబ్బారావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని ప్రధానోపాధ్యాయురాలు డి ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిద్రండులోపాటు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ పిల్లా బిందుమాధవి, మాజీ కౌన్సిలర్ అడబాల నారాయణమూర్తి, యజ్జడ అనిల్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని స్థానిక శ్రీవాసవి జూనియర్ కళాశాలలో తల్లికి వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సి పల్ మద్దాల రామకృష్ణ, కళాశాల చైర్మన్ ఎన్వీ రమణారావు, సెక్రటరీ మండా బ్రహ్మాజీ, వి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోనే చక్కటి భవిష్యత్తు

తణుకు అర్బన్: విద్యార్థులు పోటీ తత్వంతో కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని పలువురు వక్తలు తెలిపారు. స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో గురువారం తెలుగు, హిందీ, సంస్కృత విభాగాల ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయ్ మాట్లాడుతూ గురువులకు కృతజ్ఞతలు తెలిపే పవిత్రమైన పండుగ గురు పౌర్ణమి అన్నారు. మహా భారతాన్ని వేదాలను విభజించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన వ్యాస మహర్షి జన్మ దినమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృత అధ్యాపకులు డాక్టర్ జి.అమృతవల్లీతాయారు, తెలుగు అధ్యాపకులు పి.శివప్రసాద్, కేవీ శ్యామలా దేవి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పెంటపాడు: గురుపౌర్ణమి సందర్భంగా గురువారం సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం తెల్లవారుజాము నుంచి భక్తులు సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. షిర్డీ సాయి మందిరంలో భక్తులు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బాబాకు పాలాభిషేకం నిర్వహించారు. పెంటపాడు ఊరచెరువు వద్ద ఉన్న సాయిబాబా ఆలయంలో ట్రస్టు అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సూర్యనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అలంపురం సాయిబాబు ఆలయంలో వెంకటరమణ సేవా ట్రస్టు అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సదస్సులో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్



ఢిల్లీలో జాతీయ స్థాయి సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: వైద్యం, ఆసుపత్రుల్లో మౌలిక వసతులపై న్యూ ఢిల్లీలో పీఎస్సార్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సులో ఆంధ్రప్రదేశ్ నుంచి శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ పాల్గొన్నారు. ఇండియన్ ఇంటర్నేషనల్ సెంటర్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల్లో ఉన్న సదుపాయాలు, కార్యాచరణ, ప్రజల ఆరోగ్య భద్రత అంశాలపై పూర్తిస్థాయి అధ్యయనం చేసినట్లు రవీంద్రనాథ్ వివరించారు. జాతీయ ఆరోగ్య పాలసీ పరిశోధన విభాగం హెడ్ డాక్టర్ ఇంద్రాణి గుప్తా, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్, సెంటర్ ఫర్ యూనివర్సల్ హెల్త్ అస్యూరెన్స్ డాక్టర్ షాలిని సింగ్, ప్రోగ్రామ్ ఆఫీసర్, బిల్ గేట్స్ ఫౌండేషన్ రవి తేజ స్పీకర్స్‌గా వ్యవహరించారు .